క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం పరిశీలన



వసతి గృహంలో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాధారాణి

యాచారం: విద్యార్థులకు నాణ్యమైన భోజనం , మెరుగైన విద్యాబోధనలో రాజీపడొద్దని ఎంపీడీఓ రాధారాణి సూచించారు. మండల కేంద్రంలోని బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని బుధవారం ఆమె సందర్శించారు. వంట గదిలోకి వెళ్లి కూరగాయలు, పప్పులు, ఇతర వంట పదార్థాలను తనిఖీ చేశారు. వండిన భోజనం, కూరలను పరిశీలించి నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన తుర్కయంజాల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారంలో ఒక రోజు రెండు గంటల పాటు స్వచ్ఛత కోసం సమయం కేటాయించాలన్నారు. అనంతరం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, డీఈ భిక్షపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో అధికారులు

మంచాల: గ్రామాల్లో అందరూ మొక్కలు నాటాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ సూచించారు. బుధవారం మండలంలోని ఆరుట్ల ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం బాధ్యతగా మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, డాక్టర్ దీప్తి, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిఘంటువుల పంపిణీ



నిఘంటువులతో విద్యార్థులు

మంచాల: మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు బుధవారం ఆంగ్ల నిఘంటువులు పంపిణీ చేశారు. పాఠశాలలో గతంలో ఉపాధ్యాయుడిగా పని చేసిన బత్తుల శ్రీనివాస్‌గౌడ్ విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఉపాధ్యాయులు మోహన్‌గౌడ్, పాపిరెడ్డి, కిషన్, చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్, నర్సయ్య, అమిత, గీత, నాగమణి, సుమలత, శ్రావణి, పేరెంట్స్ కమిటీ సభ్యులు భాస్కర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాఘవాచారికి నివాళి



దండుమైలారం సంస్మరణ సభలో నాయకులు, గ్రామస్తులు

ఇబ్రహీంపట్నం రూరల్: రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి అమరుడైన సాయుధ పోరాట యోధుడు రావినూతల రాఘవాచారి అని వీహెచ్‌పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్ పేర్కొన్నారు. బుధవారం దండుమైలారం గ్రామంలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి ఉద్యమాన్ని నడిపించిన రాఘవాచారి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఊరూరా ఉప్పొంగిన జాతీయవాదం

నిజాం నిరంకుశత్వానికి చరమగీతం పాడి తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైన సందర్భంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం, కేంద్రం విమోచన దినోత్సవం వేర్వేరుగా ఘనంగా నిర్వహించాయి. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలల ఆధ్వర్యంలో జాతీయజెండాను ఆవిష్కరించారు. రజాకార్ల దుర్మార్గాలతో సబ్బండవర్గాలు ఏకమై పోరు చేసిన తీరు నేటితరానికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: జాతీయ జెండా ఎగరవేస్తున్న ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ



ఆమనగల్లులో జాతీయ జెండా ఎగురవేస్తున్న మార్కెట్ చైర్మన్ గీత



మంచాల: మండల పరిషత్ కార్యాలయం వద్ద..



తుర్కయంజాల్: జాతీయ జెండాను ఎగురవేస్తున్న కమిషనర్ అమరేందర్ రెడ్డి



ఇబ్రహీంపట్నం చౌరస్తాలో బీజేపీ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి నివాళి



ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్‌లో సీపీఎం సాయుధ పోరాట వారోత్సవాలు



కడ్తాల్: ప్రజాపాలనలో జాతీయ జెండా ఎగురవేస్తున్న నాయకులు



కడ్తాల్: జాతీయ జెండా ఎగురవేస్తున్న బీజేపీ నాయకులు



యాచారం: మండల పరిషత్ కార్యాలయంలో..



యాచారం: జెండావిష్కరణలో తహసీల్దార్ అయ్యప్ప



తలకొండపల్లిలో సింగిల్ విండో కార్యాలయం వద్ద..



మాడ్గుల: బ్రాహ్మణపల్లిలో..

సీజనల్ తాకిడి

రోగులతో కిటకిటలాడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

- సాధారణం కంటే అధికంగా ఓపీ సేవలు
- భయాందోళన వద్దంటున్న వైద్యులు

మంచాల: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలుబు, దగ్గు, జ్వరం తదితర వాటితో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగింది. మండలంలోని మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోనే లోయపల్లి, లింగంపల్లి, రంగాపూర్, ఆగపల్లి సబ్ సెంటర్లు కొనసాగుతున్నాయి. మంచాల వైద్యశాలకు సాధారణంగా ప్రతి రోజు 70 నుంచి 80 మంది రోగులు వచ్చేవారు. సీజనల్ వ్యాధుల కారణంగా 200 మంది వరకు రోగులు వస్తున్నారు. ఆరుట్ల పీహెచ్‌సీకి సాధారణంగా నిత్యం 120 మంది రోగులు వచ్చేవారు. ప్రస్తుతం 250 మందికి పైగానే చికిత్స కోసం వస్తున్నారు.

వైరల్ జ్వరాలే ఎక్కువ

వైద్యశాలలకు వచ్చే రోగుల్లో ఎక్కువగా దగ్గు, జలుబు, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. ఈ వైరల్ జ్వరాలు తగ్గిన మూడు లేదా నాలుగు రోజులకు మరలా రెండోసారి సైతం వస్తుంది. దీంతో భయందోళనకు గురై రోగులు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. ఈ సీజనల్ వ్యాధుల కారణంగా ప్రైవేట్ వైద్యశాలలు, ఆర్‌ఎంపీ డాక్టర్ల వద్దకు క్యూ కడుతున్నారు. మెడికల్ ల్యాబ్‌లు, మందుల దుకాణాల నిర్వాహకులు రోగుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు.



ఆరుట్ల వైద్యశాలలో వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులు

సేవలందించాలి

ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలి. వ్యాధులకు సంబంధించి ఒకటి, రెండు మందులు ఇస్తున్నామని చెప్పడం కాదు. మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి. దీనికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– మోహన్‌రెడ్డి, లింగంపల్లి

పరిశుభ్రత పాటించాలి

సీజనల్ వ్యాధులు ప్రధానంగా అపరిశుభ్రత కారణంగా వస్తుంటాయి. పరిశుభ్రత పాటించాలి. చేతులు శుభ్రంగా కడుకోవాలి. పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచవద్దు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. వేడి, వేడి ఆహారం తినాలి. బయట ఆహారం ఎట్టి పరిస్థితిలో తీసుకోకూడదు.

– డాక్టర్ దీప్తి, పీహెచ్‌సీ ఆరుట్ల

రోగులు పెరిగారు

ప్రభుత్వ వైద్యశాలలకు సీజనల్ వ్యాధులకు సంబంధించిన అన్ని రకాల మందులు ప్రభుత్వం సరఫరా చేసింది. వచ్చే రోగుల్లో అధికంగా దగ్గు, జలుబు, జ్వరాలతో బాధపడుతున్న వారు ఉన్నారు. పరీక్షలు చేసి మందులు ఇస్తున్నాం. రోగుల సంఖ్య కూడా పెరిగింది.

– డాక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పీహెచ్‌సీ మంచాల

పదో రోజుకు చేరిన రిలే దీక్షలు

కడ్తాల్: మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లోని వ్యవసాయ పొలాల మీదుగా 765 కేవీ బీదర్–మహేశ్వరం హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆయా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చాలని మండల కేంద్రంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారానికి పదో రోజుకు చేరుకున్నాయి. జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ సభ్యులు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గంప శ్రీనివాస్‌గుప్తా, పాండుయాదవ్, కేశవులుగౌడ్, చేగూరి రాములు రిలే దీక్ష చేపట్టారు. దీక్షలకు బీజేపీ నేత ఆచారి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అలైన్‌మెంట్ మార్చే వరకు, రైతులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.



దీక్షకు సంఘీభావం తెలిపిన నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

ఆమనగల్లు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు విష్ణుమూర్తి, దుగ్గాపురం పాండులను మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వీరికి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు ప్రతి ఒక్కరు రుణపడి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు కృష్ణయ విజయ్, సాయిలు, ఆలయ కమిటీ చైర్మన్ మధు, వైస్ చైర్మన్ నర్సింహ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



ఆమనగల్లు: పూజలు చేస్తున్న సంఘం సభ్యులు

ఆమనగల్లు: పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక పట్టణంలోని బ్రహ్మగిరి దేవాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉదయం విశ్వకర్మ పూజ, గాయత్రీపూజ ఘనంగా చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం విశ్వకర్మ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. విశ్వకర్మ ఊరేగింపులో మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో స్వర్ణకారసంఘం అధ్యక్షుడు కాసోజు రాము, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, మాజీ కౌన్సిలర్ శేఖర్, స్వర్ణకార సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆది దేవుడికి పూజలు

కడ్తాల్: విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడని, దేవలోకాలకు నిర్మించిన భవన శిల్పి వాస్తు శిల్పి స్థపతి అని విశ్వకర్మ చేతి వృత్తుల సేవా సంఘం మండల అధ్యక్షుడు రాగిపాణి లక్ష్మణచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాఘవచారి, లింగయ్యచారి, శివలింగచారి, భాస్కర్‌చారి తదితరులు ఉన్నారు.

పంటల నమోదు తప్పనిసరి

ఆమనగల్లు: రైతులు తాము సాగుచేసిన పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీ శోభారాణి సూచించారు. మండలంలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం ఏఈఓ గాయత్రి ఆధ్వర్యంలో పంటల నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ పంటల వివరాలను ఏఈఓల వద్ద తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఏఓ శ్రీనివాస్‌గౌడ్, మాజీసర్పంచ్ యాదయ్య పాల్గొన్నారు.



చింతలపల్లిలో పంటల నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ శోభారాణి

కూలీల సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్‌ల(రోజువారీ కూలీ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్ కాంటినింజెట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి 6వ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరాన్ని రాఘవేందర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాలల్లో, హాస్టల్స్‌లో పనిచేస్తున్న వర్కర్స్‌ను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కుమార్‌గౌడ్, సిబ్బంది సైదమ్మ, సుమలత, శోభ, వాసు, మస్రు, లక్ష్మి, చంద్రకళ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేందర్

ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు

కడ్తాల్: జాతీయ రహదారి ఫుట్‌పాత్ ఆక్రమణలపై స్థానిక పోలీసులతో పాటు, షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం కడ్తాల్‌లో ఫుట్‌పాత్‌లపై వెలసిన కొట్లు, దుకాణాలు, తోపుడు బండ్లను తొలగింపజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించేలా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రైనేజీలపై ఉన్న డబ్బాలను కూడా తీసి వేయాలని వ్యాపారులకు సూచించారు. ఉన్నపళంగా బండ్లను తొలగిస్తే తాము ఎలా బతకాలని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, సీఐ గంగాధర్, ఎంపీడీఓ సుజాత, ఎస్‌ఐ వరప్రసాద్, ఏఎస్‌ఐ బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ఫుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగిస్తున్న ట్రాఫిక్, ఎన్‌హెచ్‌ఏ సిబ్బంది

కాలుష్యం నుంచి పంటలను కాపాడండి

కొందుర్గు: కాలుష్యం బారి నుంచి తమ పంటలను కాపాడాలని కొందుర్గు రైతులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులోని శ్యామ్ గోదావరి స్మెల్టర్స్ బ్యాటరీ కంపెనీ నుంచి వెలువడుతున్న పొగతో తమ పంటలు దెబ్బతింటున్నాయని వాపోయారు. పచ్చని పంట పొలాలు కాలుష్యంతో ఎర్రగా మారుతున్నాయని, ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు

భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున కార్యక్రమాలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాల్లో కేక్‌లు కట్ చేసి తమ అభిమాన నాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. నరేంద్ర మోదీ పాలనలో దేశం సుభిక్షంగా ఉందని పలువురు కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం రూరల్: కేక్ కట్ చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్



యాచారం: కేక్ కట్ చేస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు విజయ్‌నాయక్



ఆమనగల్లులో కేకు కట్ చేస్తున్న ఆచారి, గువ్వల బాలరాజు



మంచాల: ఆరుట్లలో రక్తదాన కార్యక్రమంలో నాయకుడు లచ్చిరెడ్డి తదితరులు